హైడ్రా కూల్చివేతలతో ప్రజలు ఆందోళన చెందొద్దు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హైడ్రా కూల్చివేతలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆందోళన చెందవద్దని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. హైడ్రా కూల్చివేతలపై సమీక్షించి పేద, మధ్యతరగతి ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగించాలని కోరుతూ సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు రాజశేఖర్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల ప్రజలు దాదాపు మూడు దశాబ్దాల క్రితం అప్పుసొప్పు చేసి ప్లాట్లు కొనుగోలు చేసి నివాసాలు ఏర్పర్చుకున్నారని చెప్పారు. ఇటీవల చేపడుతున్న కూల్చివేతలతో వారంతా భయాందోళనలకు గురవుతున్నారని ఆయన చెప్పారు. పెద్దమనుషులు, భారీ స్థాయిలో చేపట్టిన ఆక్రమణల తొలగింపు, కూల్చివేతలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. కూల్చివేతలకు ముందు సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



అమ్మమాట పుస్తకఆవిష్కరణలో ఆచార్య గౌరీశంకర్, బాలచారి

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే రచనలు రావాలి

సైదాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే రచనలు రావాలని తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ గౌరీశంకర్ అన్నారు. సైదాబాద్ సరస్వతీనగర్‌లోని వైదేహి ఆశ్రమంలో పెంజర్ల లక్ష్మీనర్సమ్మ సంకలనం చేసిన అమ్మమాట పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. కవితలు, కథలు, పద్యాలు కాకుండా మంచి సూక్తులు అమ్మమాట పుస్తకంలో రచయిత్రి పొందుపరిచారని వివరించారు. తెలుగు సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలచారి మాట్లాడుతూ సమాజంలో విలువలను పెంపొందించటానికి అవసరమైన సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందని తెలిపారు. ఈసందర్భంగా రచయిత నర్సమ్మ తన రచనల నేపథ్య మూలాలను వివరించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ రైటర్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(హౌకా)అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్, సైకాలజిస్ట్ డాక్టర్ సీ. వీరేందర్, వైదేహి సేవా సమితి అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, సీతాకుమారి పాల్గొన్నారు.

శ్రీశ్రీనివాసకాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

ఎల్బీనగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీనివాసకాలనీ ఫేజ్-1 సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీ. శేషగిరిరావు, గౌరవాధ్యక్షుడిగా డీ. మహేందర్, ఉపాధ్యక్షులుగా సీ. రమేష్, ఏ. శ్రీనాథ్, ఎన్. సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. బాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వై. శ్రీనివాస్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డీ. రవి, సీ. రాజు, కోశాధికారిగా ఎం. మహేందర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా డీ. రాజు, ఎస్. గోవర్ధన్‌రెడ్డి, ఎం. రాంరెడ్డి, దత్తు నారాయణ, ఎస్వీ రమణ, ఎల్లయ్య, ఏ.రఘునాథ్, సీ. జగదీష్, కే. అంజిరెడ్డి, ఆర్. రాజేష్, సీ. శంకర్ ఎన్నికయ్యారు.

వీరన్నగుట్ట వద్ద షెడ్డు కూల్చివేత



హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేసిన షెడ్డు

హయత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాగ్ హయత్‌నగర్‌లోని వీరన్న గుట్ట వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షెడ్డును హెచ్ఎండీఏ అధికారులు సోమవారం కూల్చివేశారు. ప్రతి సంవత్సరం శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించే ప్రాంతంలోనే షెడ్డును వేయగా కూల్చివేశారు. దీంతో స్థానిక యాదవ సంఘం నేతలు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకే కూల్చివేసినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

సంఘటితమై సమస్యలు పరిష్కరించుకుందాం

● టీఎన్‌జీఓ అధ్యక్షుడు జగదీశ్వర్

ఎల్బీనగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తొమ్మిది లక్షల మంది ఉద్యోగులమందరం సంఘటితమై సమస్యలను పరిష్కరించుకుందామని టీఎన్‌జీఓ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం ఎన్టీఆర్‌నగర్‌లోని మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రం ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగుల గురించి మాట్లాడే నాథుడే కరువయ్యాడన్నారు. కొన్ని సంఘాల మాటల వల్లనే ఉద్యోగులు ప్రభుత్వానికి దూరం అవుతున్నారని అన్నారు. ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏ, పీఆర్సీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, చిలుక నర్సింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, లక్ష్మణ్, కొండల్‌రెడ్డి, పర్వతాలు, గోవర్ధన్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు తరలిస్తుండగా వ్యక్తి మృతి

ఆదిభట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు తీసుకువస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ నాదర్‌గుల్‌లో ఓ కంటైనర్ వద్ద ముగ్గురు ఆటోలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి వెళ్లిన పోలీసులకు నగరంలోని బాబానగర్‌కు చెందిన మహ్మద్ హాజీ(43), నల్గొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండకు చెందిన రత్లావత్ గోవింద్(27), ఇదే మండలం మర్రిచెట్టుతండాకు చెందిన ఆటోడ్రైవర్ సెనావత్ నరేష్(25)లు కనిపించారు. వారిని అదే ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వస్తుండగా మహ్మద్ హాజీ గుండెనొప్పిగా ఉందని తెలిపాడు. అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. హాజీకి 20 రోజుల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ అయ్యిందని, అతడు బాలాపూర్‌లోని దర్గాను దర్శించుకొని వస్తుండగా పోలీసులు పట్టుకొని తీవ్రంగా కొట్టడం వల్లే మృతిచెంది ఉండొచ్చని హాజీ సోదరుడి కుమారుడు మహ్మద్ ఫయిస్ అనుమానం వ్యక్తం చేశారు.



నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో అభాగ్యులతో కలిసి ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకుడు గిరి, ఆయన కుటుంబ సభ్యులు



శ్రీకృష్ణ ఉత్సవ ఊరేగింపులో కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్ తదితరులు



కవాడిపల్లిలో శ్రీకృష్ణుడి తొట్టెల కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మలక్‌పేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉట్లు కొడుతున్న చిన్నారులు

హయత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్, తుర్కయంజాల్ ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భగవాన్ శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి డోలారోహణ చేశారు. అనంతరం పలు రకాల ప్రసాదాలను ప్రజలకు వితరణ చేశారు. హయత్‌నగర్ మదర్‌డెయిరీ రోడ్డులోని శ్రీకృష్ణాలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉట్లుకొట్టారు. ప్రజలు ఉట్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలతో అలరించారు. హయత్‌నగర్‌లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సైదాబాద్: మాదన్నపేట మండీ ఆవరణలోని గోశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గోశాల చైర్మన్ సహదేవ్‌యాదవ్, అధ్యక్షుడు ఉగాది మహేష్, బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, నాగరాజు, శ్యాం, సుధీర్ పాల్గొన్నారు.

ఆర్‌కేపురంలో..

ఎల్బీనగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని శ్రీరామకృష్ణాపురం కాలనీలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు నర్సింగరావు, శ్రీనివాస్, ఐటీడీఈఎస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు నరహరి, గణేష్‌బాబు, నిర్వాహకులు రామారావు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణమ్మ, శ్రీనివాస్, నీలిమ, రాధ పాల్గొన్నారు.











చంపాపేటలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు, కుర్మగూడలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు, సైదాబాద్‌లో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారి

కవాడిపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని కవాడిపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలోని శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 4గంటలకు శ్రీకృష్ణుడి తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, యాదవ సంఘం నాయకులు మెరుగు బాబుయాదవ్, రాసాల కాషయ్యయాదవ్, రాసాల భాస్కర్‌యాదవ్, ఎర్రకోల్ నర్సింహయాదవ్, కొలన్ కొండల్‌రెడ్డి, భిక్షపతియాదవ్, రాసాల రాముయాదవ్ పాల్గొన్నారు.

మాతృ దేవోభవలో..

నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో ఆశ్రమం నిర్వాహకుడు గట్టు గిరి, ఆయన కుటుంబ సభ్యులు.. ఆశ్రమంలోని అభాగ్యులతో కలిసి కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభాగ్యులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృష్ణ తత్వం అందరికీ ఆదర్శనీయం : గోపాలకృష్ణానంద స్వామీజీ

సరూర్‌నగర్: శ్రీకృష్ణ భగవానుడు సర్వ జగద్రక్షకుడని, ఆయన తత్వం అందరికీ ఆదర్శనీయమని మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీసాయిబాబా దత్త పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ అన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం పీఠంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని, సాయిబాబా విగ్రహానికి నెమలి పింఛం ధరింపజేశారు. బాలగోపాలుడి చిరు విగ్రహాన్ని ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం బాబాకు హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం వారికి అన్నదానం నిర్వహించారు.

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలోని చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలోని భాస్కవారి శ్రీకృష్ణమందిరంలో భక్తులు స్వామి వారికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం హనుమాన్ ఆలయం కృష్ణమందిరం ఆలయ ప్రాంగణంలో ఉట్లు కొట్టే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కనులపండువగా శ్రీకృష్ణ ఉత్సవ ఊరేగింపు

వనస్థలిపురం: నాగోల్ శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాగోల్‌లో శ్రీకృష్ణుని ఉత్సవ ఊరేగింపు కార్యక్రమం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు చింతల కిరణ్‌కుమార్‌యాదవ్, జనార్ధన్‌యాదవ్, జీ.కృష్ణాయాదవ్, గిరియాదవ్, రామచందర్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

'మానస'లో దివ్యాంగ చిన్నారుల శ్రీకృష్ణాష్టమి వేడుకలు

● వేడుకల్లో పాల్గొన్న కెన్యా క్రీడాకారుల బృందం



చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ 'మానస'లో దివ్యాంగ చిన్నారులతో కెన్యా క్రీడాకారుల బృందం, మానస సిబ్బంది

కొత్తపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మోహన్‌నగర్‌లోని చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ 'మానస'లో సోమవారం దివ్యాంగ చిన్నారుల శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మానస సంస్థకు విచ్చేసిన కెన్యా క్రీడాకారుల బృందాన్ని దివ్యాంగ చిన్నారులు శ్రీకృష్ణ, గోపికా వేషాల్లో పుష్పగుచ్ఛాలు అందజేస్తూ, సంప్రదాయబద్ధంగా వారికి బొట్టుపెట్టి ఆహ్వానించారు. మానస వృత్తివిద్యా కేంద్రంలో శిక్షణ పొందుతున్న విష్ణుభట్‌జోషి పాడిన శ్రీకృష్ణుడి స్తుతి గీతాలు, నైనా సోని శాస్త్రీయ నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెన్యా మారథన్ రన్నర్స్ ఎజికిల్ క్రిప్కోరిర్, శీలాచెలంగాట్, జెనిత్ కిప్ప, హమింగ్టన్ చెరోప్, ఢిల్లీ మారథన్ రన్నర్ విపుల్, ఉత్తరాఖండ్ రన్నర్ భరీరతి, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన సునీల్ శర్మ, విజయనగరం గజపతినగరానికి చెందిన ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్న మారథన్ రన్నర్ శ్రీను భుగత మానస సంస్థలో దివ్యాంగ పిల్లలకు విద్యా, వైద్య సదుపాయాలు, వృత్తి విద్యా శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ వ్యవస్థాపకులు రాజష్ వెట్చ, ప్రతినిధులు స్మిత చామిలింగ్, కే.సుందర్ నగేష్, విజిగీష, గౌతమ్, ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ లింగాల లక్ష్మి, న్యూరో డెవలప్‌మెంట్ విభాగం హెడ్ మెర్సీ మధురిమ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

●ఎమ్మెల్యే సబితారెడ్డి



జిల్లెలగూడలో రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారులపై, వీధుల్లో మురుగు నీరు ప్రవహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె జిల్లెలగూడ, మీర్‌పేట్‌లలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. జిల్లెలగూడ ప్రధాన రహదారిపై పారుతున్న డ్రైనేజీ నీటిని చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చిన్న చిన్న సమస్యలను సైతం పట్టించుకోకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. అనంతరం మిథిలానగర్, సత్యసాయినగర్ కాలనీల్లో పర్యటించి, వర్షం వచ్చినప్పుడు స్థానికులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యపై ఆరా తీశారు. ఇక్కడ ముంపు సమస్య నివారణకు చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, కార్పొరేటర్లు సిద్దాల లావణ్యబీరప్ప, బొక్క రాజేందర్‌రెడ్డి, రేఖాలక్ష్మణ్‌ముదిరాజ్, సురేఖారమేశ్, పద్మాఅంజయ్య, పాల్గొన్నారు.

మలక్‌పేట జలమండలి డీజీఎం బదిలీ

● ఇన్‌చార్జి డీజీఎంగా కె.నాగరాజు

ఓల్డ్‌మలక్‌పేట : మలక్‌పేట జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్. అభిలాష్ బదిలీపై సుంకిశాల ప్రాజెక్టుకు వెళ్లారు. ఆయన స్థానంలో వినయ్‌నగర్ జలమండలి సబ్‌డివిజన్ డీజీఎం కె.నాగరాజును మలక్‌పేట జలమండలికి ఇన్‌చార్జి డీజీఎంగా నియమించారు. ఇటీవలే మలక్‌పేట డీజీఎంగా వచ్చిన అభిలాష్ నెలరోజులు కాకముందే ట్రాన్స్‌ఫర్ కావడంతో తోటి ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఈయన ప్రాజెక్టు కార్యాలయాల్లో పనిచేసిన వ్యక్తి కావడం, ఫీల్డ్‌వర్క్ అనుభవంలేని కారణంగా సంబంధిత ఉన్నతాధికారులు సుంకిశాల ప్రాజెక్టుకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సమాచారం.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

వనస్థలిపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. మథర్ థెరిస్సా 114వ జయంతి సందర్భంగా మథర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్‌తో కలిసి మాట్లాడారు. తలసేమియా బాధితులు సరిపడ రక్తం అందకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, శేషు, వెంకట్ రెడ్డి, నిట్టు కృష్ణ కురుమ, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మదర్ డెయిరీలో ఆరు డైరెక్టర్ పదవుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

● ఆరు డైరెక్టర్ పదవులకు సెప్టెంబర్ 13న ఎన్నికలు

హయత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమితి లిమిటెడ్(మదర్ డెయిరీ) గత సంవత్సరం సెప్టెంబర్ 30న ముగిసిన ముగ్గురి డైరెక్టర్ల పదవులకు, ఈ సంవత్సరం సెప్టెంబర్ 30న ముగియనున్న ముగ్గురు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు మదర్‌డెయిరీ ఎన్నికల అధికారి ఎ. వెంకట్‌రెడ్డి తెలిపారు. నార్మాక్స్ బైలా ప్రకారం ప్రతి సంవత్సరం ముగ్గురు డైరెక్టర్లకు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. అనివార్య కారణాల వల్ల గత సంవత్సరం ఎన్నికలు నిర్వహించలేకపోయామని ఆయన తెలిపారు. దీంతో ఈసారి ఆరు డైరెక్టర్ పదవులకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నిక పూర్తి అయిన తర్వాత మదర్ డెయిరీ చైర్మన్‌ను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 4న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మదర్ డెయిరీలోని సమావేశమందిరంలో నామినేషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. నామినేషన్ ఫీజు రూ.10వేలు ఉంటుందన్నారు. నామినేషన్ల పరిశీలన సెప్టెంబర్- 5న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, అదే రోజు 2గంటల తర్వాత చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితా ప్రకటన, 6న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు 5గంటల తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. పోటీ లేనట్లయితే అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. 13న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు హయత్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీకి ఎదురుగా ఉన్న ఎస్వీ కన్వెన్షన్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు జరుగుతుంది. గెలిచిన అభ్యర్థులకు లాటరీ పద్ధతి ద్వారా వారి పదవి కాలం నిర్ణయించబడుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. అనంతరం చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

విలేకరుల పేరుతో వైద్యుడికి బెదిరింపులు

● బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్ : కొత్తగా చేపడుతున్న ఇంటి వద్ద బోరు వేస్తుంటే విలేకరులమని చెప్పుకుంటున్న ఇద్దరు వ్యక్తులు బెదిరించారని ఓ వైద్యుడు చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చైతన్యపురి ద్వారకానగర్‌లో నివసిస్తున్న డాక్టర్ వేణుగోపాల్ ఇంటి నిర్మాణంలో భాగంగా సోమవారం బోరు వేయిస్తున్నాడు. ఈ సమయంలో నెంబర్ లేని ద్విచక్రవాహనంపై వచ్చిన సతీష్, ఫణి అనే ఇద్దరు వ్యక్తులు తమను తాము మీడియా ప్రతినిధులుగా పరిచయం చేసుకున్నారు. బోరు వేసేందుకు లైసెన్స్ ఉందా ? ఉంటే చూపమని డిమాండ్ చేశారు. మీడియా ఐడీ కార్డు చూపమంటే దూషణలకు దిగారు, బోరు వేయనీయకుండా చేస్తాం.. అంతుచూస్తామంటూ డాక్టర్ కుటుంబ సభ్యులపై బెదిరింపులకు పాల్పడ్డారు. సాయంత్రంలోగా రూ. 20వేలు ఇవ్వకుంటే ఇల్లు ఎలా కట్టుకుంటావో చూస్తామంటూ బెదిరించారు. దాంతో వైద్యుడు వేణుగోపాల్ సతీష్, ఫణిలపై చర్యలు తీసుకోవాలని చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నాగోల్ జైపురికాలనీలో టీచర్ అదృశ్యం



సుమలత (ఫైల్)

కొత్తపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధి జైపురికాలనీలో ఓ ప్రైవేటు టీచర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి అదృశ్యమైంది. వివరాల ప్రకారం.. జైపురికాలనీలో ఉండే బండారి సుమలత(24) ప్రైవేటు స్కూల్ టీచర్. ఈనెల 25వ తేదీన ఉదయం ఆమె తల్లి బండారి సీతావరప్రసాదిని, సోదరులు వారి పనుల కోసం బయటకు వెళ్లిపోయారు. వారు అదే రోజు సాయంత్రం వారు ఇంటికి చేరుకుని చూస్తే సుమలత కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం వారు బంధువులను, తెలిసిన వారిని సంప్రదించారు. ఫలితం దక్కకపోవడంతో సోమవారం సాయంత్రం సీతావరప్రసాదిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

వనస్థలిపురం : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్ నుంచి ఎస్కేడినగర్ వైపు వెళ్లె దారిలో గుర్తు తెలియని వ్యక్తి(60) రోడ్డు దాటుతున్నాడు. కాగా అదే సమయంలో ఎస్కేడినగర్ నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వెళ్తున్న ఆటో(టీఎస్12యూసీ 1612) అతివేగంగా దూసుకవచ్చి రోడ్డు దాటుతున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర రక్తస్రావమైన గుర్తుతెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అక్కడి వైద్యులు సదరు వ్యక్తి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల్లోని ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

● ఎఫ్‌టీఎల్‌లో ఎన్నో అక్రమ నిర్మాణాలు

● కేఎల్లార్‌కు మీర్‌పేట్ కార్పొరేటర్ల ఫిర్యాదు

సరూర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు, మీర్‌పేట్ మంత్రాలచెరువు, పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయని, వాటిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మీర్‌పేట్ కార్పొరేటర్లు ఇంద్రావత్‌రవినాయక్, నీలారవినాయక్, ముత్తంగి కరుణానిధి, కొంద్ర గౌరీశంకర్ తదితరులు సోమవారం మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్‌కు ఫిర్యాదు చేశారు. గత శనివారం వారు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సైతం కలిసి సదరు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లెలగూడ చందచెరువు సగానికిపైగా కుంచించుకుపోగా, మంత్రాలచెరువు సైతం కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ఇక అల్మాస్‌గూడను ఆనుకుని ఉన్న మీర్‌పేట్ పెద్దచెరువులోనూ అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయని ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే భారీ స్థాయిలో షెడ్లు, పెట్రోల్ బంకులు సైతం ఏర్పాటవుతున్నాయని కేఎల్లార్‌కు వివరించారు. వాటిపై అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని, హైడ్రా వాటిపై దృష్టి పెట్టి అడ్డుకునేలా చూడాలని వారు కేఎల్లార్‌ను కోరారు.

సర్వే నంబర్.119లో ఏడెకరాల ప్రభుత్వ భూమి కబ్జా

మీర్‌పేట్‌లోని లెనిన్‌నగర్ రైతుబజార్ వెనుక గల సర్వే నంబర్. 119,119/1,119/2,119/3లలో మొత్తం 70ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో దాదాపు ఏడు ఎకరాలను స్థానిక రాజకీయ నాయకులు కొందరు మాజీమంత్రి అండతో ఆక్రమించుకున్నారని కార్పొరేటర్లు ఆరోపించారు. సదరు భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండానే శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే అధికారులు స్పందించకపోతే మొత్తం భూమి అన్యాక్రాంతమవుతుందని కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లెలగూడలోని సర్వే నంబర్లు.120,121,122,123లో గల ప్రభుత్వ భూమి సైతం కబ్జా అవుతున్నదని తెలిపారు. ఇక మీర్‌పేట్‌లోని 132,133,137,139 సర్వే నంబర్లలో ఆర్‌సీఐ రోడ్డుకు ఇరువైపులా అనుమతి లేకుండా పెద్దపెద్ద షెడ్లు నిర్మించి, వాటిలో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారని వారు ఆరోపించారు. వాటిపై తాము స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.



మీర్‌పేట్‌లో చెరువుల ఆక్రమణలపై కేఎల్లార్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు రవినాయక్ తదితరులు

అల్మాస్‌గూడలో ఆక్రమణలపై బీజేపీ నేత ఫిర్యాదు

అల్మాస్‌గూడలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఇటీవల స్థానిక బీజేపీ నాయకుడు శూరకర్ణారెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. తాజాగా మీర్‌పేట్ కార్పొరేటర్లు సైతం హైడ్రాను, కేఎల్లార్‌ను ఆశ్రయించడంతో ఇక్కడి చెరువుల పరిసరాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటారా లేదా? అన్న చర్చ నడుస్తోంది.